ఈవీఎంల పరిశీలన


ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

చైతన్యపురి: తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ ఆధ్వర్యంలో ఈవీఎంల కమిషనింగ్ నిర్వహించారు. జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ సథురప్పన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ రవీందర్‌కుమార్, ఏఆర్‌ఓలు అరుణకుమారి, దశరథ్ ఎంఆర్‌ఓ సునీత, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థుల ఫోరమ్ అభ్యర్థిగా మంచాల శ్రీకాంత్

నాగోలు: ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థుల ఫోరమ్ ఉమ్మడి అభ్యర్థిగా మంచాల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ కూటమిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అగ్రవర్ణ పేదలు ఉన్నారన్నారు. తమకు ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బాధించపడే ప్రజలందరి కోసం పోరాడే నాయకుల మద్దతు ఉందన్నారు.

◆ ఎల్బీనగర్‌లో పోటీ చేస్తున్న వారంతా స్థానికేతరులని, అందువల్ల తనను కాలనీ వాసులు, బస్తీ వాసులు గెలిపించాలని కోరారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో 28 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నామని, ఎల్బీ నగర్ నియోజకవర్గం అభివృద్ధిని ఆకాంక్షిస్తూ తామంతా కలిసి ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థుల ఫోరమ్‌గా ఏర్పడి, తమ ఉమ్మడి అభ్యర్థిగా మంచాల శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఇతర సభ్యులు ప్రకటించారు.

మహేశ్వరంలో హోరెత్తుతున్న కాంగ్రెస్ ప్రచారం

నియోజకవర్గం మొత్తాన్ని చుట్టేస్తున్న 'హస్తం' అభ్యర్థి కేఎల్లార్

- కాంగ్రెస్ 6 గ్యారంటీలతో ప్రజలను ఆకర్షిస్తున్న వైనం
- గెలుపు ఖాయమంటున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి


సమావేశానికి హాజరైన జనం


మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్‌కు మద్దతుగా ఆర్‌కేపురంలో గురువారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తనదైన శైలిలో నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపై నడిపిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలో ఉధృతంగా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. తుక్కుగూడ సభలో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు తెలియజేస్తూ.. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణ మాఫీ, ఎకరానికి రూ.15 వేల పంట పెట్టుబడి సాయం, మహిళలలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం, మహిళలలకు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ఉన్నత చదువులకు విద్యార్థులకు రూ.5 లక్షల సహాయం, గృహ జ్యోతి పథకం ద్వారా మహిళలకు రూ.2500 చెల్లింపు ,ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు. ప్రతి గ్రామం, తండా, బస్తీ, కాలనీలలో అభ్యర్థి కేఎల్లార్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి తిరుగుతూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ముందంజలో ఉంది. ఉన్నత తక్కువ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కేఎల్లార్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్యం చేస్తూ కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులను చేస్తున్నారు. గతంలో కేఎల్లార్ లీడ్ ఇండియా ద్వారా చేసిన పనులు, సేవ కార్యక్రమాలను యువతకు తెలియజేస్తూ ముందుకెళ్తున్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో పాటు రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ప్రచారం చేస్తూ హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా కేఎల్లార్ ప్రచార సభలకు, ర్యాలీలకు ప్రజలు తండోప తండాలుగా వస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళనాలు, కుల సంఘాల సమ్మేళనాలు, యువ గర్జనలతో జోరు గా ప్రచారం చేస్తూ అన్ని వర్గాలను కాంగ్రెస్ వైపు తిప్పుకుంటూ కేఎల్లార్ తన విజయాన్ని పక్కా చేసుకుంటున్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఇతర నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. కేఎల్లార్‌కు మ ద్దతుగా భార్య, కుమారులు ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం: హర్షలత

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమ పథకాలు అమలవుతాయని మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు తమలపాకుల హర్షలత అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి, శ్రీరామకృష్ణపురం కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి నాయకులు శకుంతల, సోనీ, శిరీష చౌదరి, నిర్మలారెడ్డి, సుచరిత చౌదరి పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలకు మరోసారి మోసపోవద్దు


ఎన్టీఆర్‌నగర్‌లో మాట్లాడుతున్న పురందేశ్వరి, శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి

దిల్‌సుఖ్‌నగర్: నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన లక్ష్యంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ మాయ మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. మహేశ్వరం నియోజక వర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో అల్కాపురి చౌరస్తా, ఎన్టీఆర్‌నగర్‌లో మహేశ్వరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌తో వేరుపడిన తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను నిండా ముంచారన్నారు. తుక్కుగూడలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఒక వర్గాన్ని కేటాయించి మహేశ్వరం నియోజకవర్గంలో అర్హులైన పేదవారికి సబితారెడ్డి అన్యాయం చేసిందని మండిపట్టారు.

◆ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ విషయాన్ని ప్రజలకు చెప్పడం లేదని విమర్శించారు. స్థానికుడైన మహేశ్వరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాములు యాదవ్, కరుణ, సిద్ధు, సురేష్, సుదర్శన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌నగర్‌లో శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి

అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి


మన్సూరాబాద్‌లో దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఆ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ గెలిపించాలని ఎల్‌బీనగర్ ఆ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని పలు డివిజన్లలోని కాలనీలలో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాలనీవాసులు, బస్తీవాసులు సుధీర్‌రెడ్డికి అడుగడుగునా మంగళహారతులు, డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెప్పుకోవటానికి ఏమీ లేవని, ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దన్నారు. గుంపులుగా వచ్చే ఇతర నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజాసేవలో పాలు పంచుకునే వారికి ఓటు వేయాలని, మరోసారి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో కొప్పుల విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, ధనలక్ష్మి, వెంకట్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.


చైతన్యపురిలో ప్రచారం చేస్తున్న విఠల్‌రెడ్డి తదితరులు

చైతన్యపురిలో..

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మద్దతుగా చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్‌లోని న్యూ మారుతీనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎల్‌బీనగర్ అభివృద్ధిపై కరపత్రాలను పంచిపెట్టి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకుల చంద్రశేఖర్‌రెడ్డి, తులసీదాస్, పవన్, గట్టు శ్రీనివాస్, కృష్ణమూర్తి, విజయరంగా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం



ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీగౌడ్‌కు మద్దతుగా గురువారం రాత్రి వనస్థలిపురంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సమావేశానికి హాజరైన జనం

పార్టీ మహేశ్వరం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

నాగోలు: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికులు ఎంతో కీలక పాత్ర పోషించారని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. గురువారం సాగర్‌రింగ్ రోడ్డులోని కేకే గార్డెన్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, తమ జీవితాన్ని అంకితం చేస్తూ, ప్రజలను విద్యార్థులను గమ్యానికి చేర్చేవారు ఆర్టీసీ కార్మికులని అన్నారు. ఆర్టీసీ ఆస్తులను పెంచి, కాపాడింది ఆర్టీసీ కార్మికులేనని అన్నారు. ఆర్టీసీ కార్మికులను గత కొంత కాలంగా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలంటే ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎంఎస్‌రెడ్డి, కొప్పూరు యాదయ్య, ఈద శంకరయ్య, వెంకటేశంగౌడ్, జగన్‌రెడ్డి, అబ్రహం, కార్తీక్‌రెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే ఎస్టీ కార్పొరేషన్, సంత్ సేవలాల్ కార్పొరేషన్, ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మధు యాష్కీ గౌడ్ అన్నారు. గురువారం ఎల్‌బీనగర్ ఎస్టీ సెల్ చైర్మన్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మధుయాష్కీ మాట్లాడుతూ, గిరిజనులకు 26 లక్షల ఎకరాల పోడు భూములను కాంగ్రెస్ ఇవ్వగా, వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుందన్నారు హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఏఐసీసీ ఆదివాసీ వైస్ చైర్మన్ బెల్లయ్ నాయక్ , కాంగ్రెస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, ధనరాజ్ గౌడ్, వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

మధుయాష్కీకి 'గౌడ్ ఆఫీషియల్స్' మద్దతు

నాగోలు: తెలంగాణ ఉద్యమ కాలంలో రాష్ట్ర సాధన కోసం నిజాయితీగా పోరాడిన వ్యక్తి మధుయాష్కీ గౌడ్ అని, ఆయనను ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిపించాలని గౌడ్ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్యల రమేష్‌బాబుగౌడ్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఎల్బీనగర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కుటుంబ నేపథ్యం లేని పాలన అవసరం

ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి


రాజీవ్‌గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: తెలంగాణలో కుటుంబ నేపథ్యం లేని పాలన అవసరమని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిని గెలిపించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన కమ్మవారి ఆత్మీయ సమ్మేళనంలో బుధవారం రాత్రి సామ రంగారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ అది మరిచి ఆస్తులను పెంచుకోవడంపై దృష్టి సారించారని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల పాల్జేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియమకాల విషయంలో కేసీఆర్ కుటుంబానికి తప్ప ఉద్యమకారులకు, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. దివంగత ఎన్టీఆర్ అభిమానులు తన అభ్యర్థనను మన్నించి సుపరిపాలన కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయకులు నూతి శ్రీనివాస్, పాతూరి అరుణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా: సామ రంగారెడ్డి

నియోజకవర్గంలో పరిధిలోని కొత్తపేట, మన్సూరాబాద్ డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్‌లు పవన్‌కుమార్, కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి బీజేపీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి కాలనీలలో ఇంటింటికి తిరిగి, వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని నేరవేరుస్తానని అన్నారు. నాయకులు నాంపల్లి రామేశ్వర్, కడారి యాదగిరి, రాజేష్, రాజునాయక్, శివాజీ నాయక్, స్వామి, శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఫోన్ కాల్ చేస్తే మీ ముందు ఉంటా...

నాగోలు: బస్తీ ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్‌తో మీ ముందు ఉంటానని, ఒకసారి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి మెజారిటీతో తనను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి కోరారు. గురువారం ప్రచారం కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ ఫేస్ 1-2, భరత్ నగర్ ఫేస్ 1-2, అంబేడ్కర్ నగర్, శివమ్మ నగర్, కాలనీలో స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు, రాజు నాయక్, శివాజీ నాయక్, శ్రీకాంత్, కిషన్, బాలు, మల్లేష్ యాదవ్, రాజు, స్వామి, కొర్లపల్లి స్వామి, మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాకుత్‌పురాలో బీజేపీదే విజయం

పార్టీ అభ్యర్థి ఎన్.వీరేంద్రబాబు యాదవ్


ఐఎస్‌సదన్‌లో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులవుతున్న యాకుత్‌పురా ప్రజలు ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తారని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి ఎన్.వీరేంద్రబాబు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఉదయం ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత బస్తీ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని నియోజకవర్గంలోని మైనారిటీలు కూడా నమ్ముతున్నారని, ఈసారి బీజేపీ అభ్యర్థి అయిన తనను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధి చేశా.. మరోసారి గెలిపించండి

మలక్‌పేట మజ్లిస్ అభ్యర్థి అహ్మద్ బలాల


మలక్‌పేటలో ప్రచారం చేస్తున్న అహ్మద్ బలాల

మలక్‌పేట: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించానని, మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని మలక్‌పేట మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. గురువారం మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇతర పార్టీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని, సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు కోసం గాలిపటం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

మలక్‌పేట నియోజకవర్గ అభ్యర్థి షేక్ అక్బర్


సైదాబాద్‌లో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న షేక్ అక్బర్

సైదాబాద్: అభివృద్ధిని కాంక్షిస్తున్న మలక్‌పేట ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ కోరారు. గురువారం ఆమన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్, సాయిరాం కాలనీ, ఎస్‌బీహెచ్-ఏ, బీ కాలనీలు, జీపీ-1, 2కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ 6 గ్యారంటీ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలక్‌పేట నియోజకవర్గంలో మజ్లిస్ నాయకులు చేస్తున్న అవినీతి, అరాచకాలను 15 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు భరిస్తున్నారని, ఈసారి వారు భయం వీడి తనను గెలిపించడం ఖాయమన్నారు. ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మదన్‌బాబు, గంట్ల కృష్ణ, చక్రపాణి పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజలకు న్యాయం

మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి


మూసారంబాగ్‌లో ప్రచారం చేస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: బీజేపీ అధికారంలో వస్తే అందరికీ మేలు జరుగుతుందని ఆ పార్టీ మలక్‌పేట నియోజకవర్గం అభ్యర్థి సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బీదర్ ఎమ్మెల్యే డాక్టర్ శైలేంద్రతో కలిసి మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారంలో ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి కమలం పువ్వుగుర్తుకు ఓటేసి మెజార్టీలతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, మడిగల లక్ష్మారెడ్డి, గజానంద్, సురేందర్ పాల్గొన్నారు.

మా సమస్యలపై రాజకీయ పార్టీలు స్పందించాలి

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం


సమావేశంలో పాల్గొన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

నాగోలు: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై రాజకీయ పార్టీలు స్పందించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండం రాజు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. గురువారం నాగోలు డివిజన్ పరిధిలోని లలితానగర్ కమ్యూనిటీ హాల్ సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు, ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య, ఉపాధ్యక్షులు వేణు మాధవ్ మాట్లాడుతూ, సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు గత 25 ఏళ్లుగా పెన్షన్ పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు పాల్పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు కానీ, కార్మిక సంఘాలు పట్టించుకోవడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సింగరేణి ఏరియా హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చేవారని, నేడు ఆ అవకాశం లేదన్నారు. హైదరాబాద్‌లో డిసెంబర్ 23 న సింగరేణి స్థాపక దినోత్సవం జరపాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో సంఘం సంయుక్త కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావ్, సలహాదారులు టి.ఉమాకర్, కార్యవర్గ సభ్యులు బి.బీరయ్య పి.కుమారస్వామి, ఎస్.లక్ష్మీనారాయణ, గీస కనకయ్య, రాజనర్సు పాల్గొన్నారు.

ముగిసిన హోం ఓటింగ్

లింగోజిగూడ: పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయలేని 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, వికలాంగులకు నిర్వహించిన ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ (హోం ఓటింగ్) గురువారంతో ముగిసింది. 80 వయస్సు దాటిన వృద్ధులు 388, దివ్యాంగులు 33 మంది ముందస్తుగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా, ఇందులో 373 మంది వయోవృద్ధులు, 33 మంది దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికల బందోబస్తులో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా 631కి గాను 491మంది వినియోగించుకున్నారు. ఎన్నికల శిక్షణ కోసం వచ్చిన 199 మంది సిబ్బంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.